క్లుప్తంగా

నేడు రైతు సంఘాల సభ్యులతో సమీక్ష

పెద్దతిప్పసముద్రం: ప్రభుత్వ రాయితీ ట్రాక్టర్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న రైతు సంఘాల సభ్యులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఏఓ ప్రేమలత అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ గ్రూపులోని సభ్యులందరూ హాజరై సంతకాలు నమోదు చేయాలన్నారు. సభ్యులకు ట్రాక్టర్‌తో పాటు అవసరమైన యంత్ర పరికరాలకు సంబంధించిన నగదు కూడా తక్షణం జమ చేయాలన్నారు. సదరు రైతు సంఘాల సభ్యులు తప్పక హాజరు కావాలని ఏఓ పేర్కొన్నారు.

3న మండల మీట్

తంబళ్లపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మార్చి 3వ తేదీన ఎంపీపీ అనసూయమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆనంద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డివిజన్, మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

కలికిరి: మండలంలోని చీకటిపల్లి గ్రామ సర్పంచ్ టి.సురేంద్రనాథ రెడ్డి తల్లి టి.సరోజమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదివారం చీకటిపల్లి గ్రామం రంగనాథపురానికి చేరుకుని సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల రమేష్ రెడ్డి, నాయకులు జగన్‌మోహన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. మదనపల్లె పరిసర ప్రాంతాల ప్రజలు కంటి పరీక్షలు చేయించుకున్నారు. శంకర్‌నేత్రాలయ వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్లు అవసరమయ్యే వారికి చెన్నై ఆస్పత్రికి రావాలని తెలియజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ నమోదుకు రేపు చివరి గడువు

పెద్దతిప్పసముద్రం: మండలంలో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 28 లోగా ఈ-కేవైసీ తప్పక చేయించుకోవాలని ఏఓ ప్రేమలత అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ పంటల బీమా, మద్దతు ధరతో పంటలను అమ్ముకోవడం, ఇతర పథకాలకు అర్హత పొందాలంటే ఈ క్రాప్‌లో నమోదు చేసిన పంటలను ధ్రువీకరిస్తూ బయోమెట్రిక్ తప్పని సరిగా వేయాలన్నారు.

గర్నిమిట్ట యల్లమ్మకు విశేష పూజలు



కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మ తల్లికి విశేషపూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. గర్నిమిట్ట పరిసర గ్రామాల నుంచి భక్తులు మంగళ వాయిద్యాల నడుమ బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సమస్యలను కలసికట్టుగా పరిష్కరించుకుందాం

వాల్మీకిపురం: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను కలసికట్టుగా పరిష్కరించుకుందామని ఆ సంఘం మండల అధ్యక్షులు శంకర అన్నారు. ఆదివారం మండలంలోని చింతపర్తి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. రాబోవు రోజుల్లో మన యూనిట్‌లో ఎవ్వరికీ ఏ సమస్య వచ్చినా ఉమ్మడిగా పోరాటం చేసి పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం ఈకేవైసీ, ఈహెచ్ఎస్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నారాయణ, మస్తాన్‌వల్లి, సారధి, బివి రమణ, నాగరాజ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ సేవకుల ర్యాలీ

మదనపల్లె సిటీ: ఆర్ఎస్ఎస్ ప్రారంభమై 97 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మదనపల్లె పట్టణంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ సేవకులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక కదిరిరోడ్డు భారత్ పాఠశాల నుంచి బీటీ కాలేజీ వరకు ర్యాలీ చేశారు. బీటీ కాలేజీ మైదానంలో జరిగిన సమావేశంలో ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ కరణం విద్యాసాగర్, రామమూర్తి మాట్లాడుతూ లవ్‌జిహాద్, డ్రగ్స్ వంటి సమస్యలు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు పార్థసారధి, జగన్‌మోహన్‌రెడ్డి, కొండారెడ్డి, సతీష్ భాను, బండి బాలాజీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.చిన్నారులు భరతమాత, ఝాన్సీ లక్ష్మీబాయి, వివేకానంద వేషధారణలు ఆకట్టుకున్నాయి.

ఆర్ఓబీ పనులు ప్రారంభం

- ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో పీలేరు పట్టణానికి ఆర్ఓబీలు
- రూ. 120 కోట్లతో రెండు ఆర్ఓబీలు మంజూరు



ఆర్ఓబీ నిర్మాణానికి చింతచెట్లు తొలగిస్తున్న దృశ్యం



పీలేరు పట్టణం మదనపల్లె మార్గంలోని రైల్వే గేటు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం చిత్తూరు మార్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులు ప్రారంభమయ్యారు. మూడు రోజులుగా రైల్వే ట్రాక్ ప్రాంతంలో కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారి-40కి ఇరువైపులా ఉన్న చింత చెట్ల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఇప్పటికే పలు చెట్లు తొలగించి బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి పీలేరు పట్టణంలో రైళ్ల రాకపోకల సమయంలో ట్రాఫిక్ సమస్యపై కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే, ఎన్‌హెచ్ మంత్రులతో సంప్రదించి ఆర్ఓబీల మంజూరుకు కృషి చేశారు.

- పీలేరు పట్టణంలో చిత్తూరు రోడ్డు, మదనపల్లె రోడ్డుకు రూ. 120 కోట్లతో రెండు ఆర్ఓబీలు మంజూరయ్యారు. ఇందులో మొదటి విడతగా చిత్తూరు రోడ్డు మార్గంలో రూ. 40 కోట్లతో 1.4 కిలోమీటర్లు బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. చెట్ల తొలగింపు పూర్తవ్వగానే మార్చి మొదటి వారం నుంచి పనులు ప్రారంభించనున్నారు. ఈ ఆర్ఓబీకి ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులకు రూ. 20 కోట్లు మంజూరైంది. ఆర్ఓబీ పనులు ప్రారంభం కావడంతో పట్టణాలు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- మదనపల్లె మార్గంలో జాతీయరహదారి 71పై ఆర్ఓబీ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. రూ. 66 కోట్లతో 1.2 కిలోమీటర్లు బ్రిడ్జి నిర్మాణం, స్థలాలు కోల్పోయిన వారికి రూ. 3.40 కోట్లు కేటాయించారు.

పీలేరు అభివృద్ధికి సహకారం



పీలేరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య, వాహనదారుల రాకపోకల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వంకు విన్నవించి ఆర్ఓబీలు మంజూరు చేయించాం. అదేవిధంగా పట్టణంలో ఎక్కువగా ఆస్తినష్టం వాటిల్లకుండా బ్రిడ్జి వెడల్పు తగ్గించడంతోపాటు పట్టణానికి బైపాస్ రోడ్డు మంజూరు చేయించాం. ఆ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పీలేరు అభివృద్ధికి నా సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది.

– పి.వి. మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ

ప్రజల అభీష్టం మేరకు వెడల్పు తగ్గింపు



పీలేరు పట్టణంలోని ప్రధాన రోడ్డు అయిన ఎల్‌బీఎస్ రోడ్డు మార్గంలో ఆర్ఓబీ నిర్మాణానికి 90 అడుగులతో బ్రిడ్జి మంజూరు కాగా, ప్రజల అభీష్టం మేరకు ప్రజలకు నష్టం వాటిల్లకుండా బ్రిడ్జి వెడల్పు 90 నుంచి 70 అడుగులకు తగ్గించాం. ఎంపీ మిథున్‌రెడ్డి కేంద్ర మంత్రులతో సంప్రదించి వెడల్పు తగ్గించడంలో కీలకపాత్ర పోషించారు.

– చింతల రామచంద్రారెడ్డి, పీలేరు ఎమ్మెల్యే

రెండేళ్లలో ఆర్ఓబీ పనులు పూర్తి



పీలేరు పట్టణం చిత్తూరు రోడ్డులో ఆర్ఓబీ పనులు రెండు సంవత్సరాల్లో పూర్తి చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆర్ఓబీకి సంబంధించి సర్వే ప్రక్రియ, స్థల సేకరణ పూర్తి అయ్యింది. స్థలం కోల్పోయిన నిర్వాసితులకు పరిహారంగా రూ. 20 కోట్లు మంజూరైంది. త్వరలో చెక్కులు పంపిణీ చేస్తాం.

– ఎం. సత్యమూర్తి, ఎన్‌హెచ్ డీఈ, చిత్తూరు

మహిళపై దాడిచేసిన ఇద్దరిపై కేసు

కలకడ : మహిళపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం, సంజీవరాయునిపల్లెకు చెందిన సంజీవరెడ్డి భార్య మాధవిపై కలకడ మండలం నడిమిచెర్ల గ్రామానికి చెందిన వెంకటరంగారెడ్డి, అతని భార్య విజయలక్ష్మి దాడి చేశారు. మధవి నుంచి అప్పు తీసుకొన్న వారిని డబ్బు అడిగినందుకు దాడిచేసి కొట్టి గాయపరిచారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సంతానం కోసం మహిళలు ఆలయ పరిసరాల్లో ఆకుపసరు సేవించి అమ్మవారి కోనేట్లో స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతాన ప్రాప్తి కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

–ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న ఆర్డీఓ మురళి

మదనపల్లె సిటీ: విద్యతోనే సమాజాభివృద్ధి చెందుతుందని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. ఆదివారం స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ధాత్రి ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు రూ.7లక్షలు స్కాలర్‌షిప్‌లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆర్డీఓ మాట్లాడుతూ మదనపల్లె వెనుబడిన ప్రాంతమని పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయడం అభినందనీయమన్నారు.స్ఫూర్తి ఫౌండేషన్ హైదరాబాదులో 120 మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నారన్నారు. ఇటీవల పేద విద్యార్థులకు తిరుపతిలో రూ.27 లక్షలు అందజేసినట్లు తెలిపారు. దాతలు ఇచ్చిన స్కాలర్‌షిప్‌లను విద్యార్థులు చదువులకు వినియోగించుకుని మంచి పేరు తేవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సామాజిక దృక్పథం అలవర్చుకోవాలన్నారు. డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ స్ఫూర్తి ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టి అందరి మన్ననలు పొందారన్నారు. ఇటీవల ధాత్రి ఫౌండేషన్ ఆహారధాత్రి, మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చారన్నారు. ఎంతో మంది స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో టు టౌన్ సీ.ఐ మురళీకృష్ణ స్ఫూర్తి ఫౌండేషన్ డైరెక్టర్ హేమశేఖర్, ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎస్.స్వాతి, సైకాలజిస్టు సుధాకర్‌రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణస్వామి, లైబ్రేరియన్ వసంతకుమారి, సభ్యులు మురళి, గీత, రమణ, రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గజ్జెల శృతి

కేవీపల్లె : ప్రజా సమస్యలపై అధికారులు స్పందించి వెంటనే పరిష్కరించాలని జెడ్పీటీసీ సభ్యులు గజ్జెల శృతి అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడులూ గత సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు ఇప్పటి వరకు పరిష్కరించలేదని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు మండల పరిషత్ అధికారులు సర్వసభ్య సమావేశంపై సరైన సమాచారం ఇవ్వకుండా తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించడం చూస్తే వారి నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీఓ మహమ్మద్ కబీర్, వైస్ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి, హరిబాబు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దాం

జిల్లా మానవత సంస్థ అధ్యక్షుడు కృష్ణమూర్తి



మాట్లాడుతున్న జిల్లా మానవత సంస్థ అధ్యక్షుడు కృష్ణమూర్తి

వాల్మీకిపురం: సమాజంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడదామని జిల్లా మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక సత్యసాయి మందిరంలో ఆ సంస్థ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద ప్రజలను ఆదుకొనేందుకే మరిన్ని సేవా కార్యక్రమాలు తమ సంస్థ తరపున చేపడతామన్నారు. మనిషిగా తన జీవితానికి పరిపూర్ణత చేకూరాలంటే కుటుంబం కోసం కాకుండా సమాజం కోసం పనిచేయాలన్నారు. అపుడే మనిషి జీవితానికి సార్థకత ఉంటుందన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షులు కేశవరెడ్డి, సభ్యులు రామకృష్ణారెడ్డి, శంకర, సివిరమణ, రఘు, పివి నారాయణ, మురళీప్రసాద్, కిట్టూ, నాగరాజ, లక్ష్మీనారాయణ, ఖాదర్‌వలి పాల్గొన్నారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- బిల్లుల మంజూరుపై శ్రద్ధపెట్టండి
- గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక
- మండల మీట్‌లో ఎంపీపీ శ్రీదేవి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : వేసవిని దృష్టిలో పెట్టుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శ్రీదేవి సూచించారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలపై చర్చించారు. అన్నిశాఖల ప్రగతి నివేదికల ఆధారంగా శాఖల వారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో విడుదల చేయలేదని కోన సర్పంచ్ జిల్లా రాజగోపాల్‌రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. జగనన్న కాలనీలకు మౌలిక వసతులు కల్పించినా, నీరు అందించినా త్వరిత గతిన బిల్లులు చెల్లించాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అటవీ ప్రాదేశాలలో, చెరువు, గుట్టలకు నిప్పు అంటించడంతో అనేక ప్రాణులు మృతి చెందడం, చెట్లు, సాగు భూములు కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి అటవీ సంపదను కాపాడాలన్నారు. ప్రమాదాలు జరగకుండా మంటలు అదుపు చేసే పద్ధతిని తెలియజేయాలన్నారు. అలాగే గ్రామాల్లో కూలీలు ఎవరూ వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలని ఉపాధి అధికారులకు ఎంపీపీ ఆదేశించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారులు ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీలు జిల్లా, క్రిష్ణకుమారి, ఈశ్వర్‌నాయుడు ఎంపీడీఓ నారాయణ, ఎంపీటీసీ సభ్యులు క్రిష్టారెడ్డి, సుజాత, ముబారక్, సర్పంచ్‌లు ప్యారీజాన్, షావత్‌అల్లీఖాన్, సీడీపీఓ క్రిష్ణ మంజిరి, ఎంఈఓ మునీంద్రనాయక్, ఏపీఓ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా ఊట ధ్వంసం

కలకడ : మండలంలో 500 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ నాగేంద్ర తెలిపారు. ఆదివారం మండలంలోని ఎనుగొండ పాళ్యెం, ఎగువతండ, దిగువతండ అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. నాటుసారా తయారీకి వినియోగించే డ్రమ్ములు, పొయ్యిలు, సారా ఊటను ధ్వంసం చేశారు. అనంతరం సీఐ గ్రామాలలో పర్యటించి సారా వలన కలిగే అనర్థాలను వివరించారు. దాడులలో కలకడ, కెవీపల్లె, గుర్రంకొండ ఎస్ఐలు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి మద్యం విక్రయించాలి



మద్యం డిపోను పరిశీలిస్తున్న ఇన్స్‌పెక్టర్ రామకృష్ణశాస్త్రి

పీలేరు : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిబంధనలకు లోబడి మద్యం విక్రయించాలని చిత్తూరు మద్యం డిపో ఇన్స్‌పెక్టర్ రామకృష్ణశాస్త్రి అన్నారు. ఆదివారం ఆయన పీలేరు పట్టణంలో వివిధ ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీత ధరలకు మద్యం విక్రయించాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాకు వివరాలు పరిశీలించారు. హెడ్‌కానిస్టేబుల్ రమణ, రాజశేఖర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి

మదనపల్లె సిటీ: రక్తదానంతో ప్రాణదాతలు కావాలని హుదా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇర్ఫాన్, జైలుద్దీన్ అన్నారు. ఆదివారం స్థానిక బెంగళూరు బస్టాండులో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ యువత రక్తదానం చేయాలని కోరారు. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. సంస్థ సభ్యులు అత్యవసర పరిస్థితుల్లో జిల్లా ఆస్పత్రిలో ఉచితంగా రక్తం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రక్తం అవసరాలు ప్రతి రోజు పెరిగిపోతున్నాయన్నారు. ఇలాంటి వారి కోసం రక్తదానం చేయాలని కోరారు. సుమారు 55 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు ఇమ్రాన్, మౌలానా,దావూద్, సైసావల్లి, బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే విజయం మీ సొంతం



పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఈశ్వరయ్య

గుర్రంకొండ: విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని అధిగమిస్తే విజయం మీ సొంతం అవుతుందని రీడో సంస్థ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, సోషియల్ ఉపాధ్యాయులు త్రినాథ్ అన్నారు. ఆదివారం స్థానిక ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో యువ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల విషయంలో పలు సూచనలు చేశారు. పదవ తరగతి తరువాత చదివే కోర్సుల వివరాలను చార్ట్ ద్వారా తెలియజేశారు. 26 జిల్లాల పూర్తి వివరాలతో కూడిన అట్లాసులను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పరీక్షలకు ప్రణాళికా బద్ధంగా చదివితే మంచి పట్టు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేటు భవన నిర్మాణానికి ప్రభుత్వాస్పత్రి నీరు

ఆస్పత్రి గోడ కూల్చేసినా పట్టించుకోని అధికారులు



ఆస్పత్రి ప్రాంగణంలో నుంచి పైపు ద్వారా నీటిని ప్రైవేటు వ్యక్తులు వినియోగించుకుంటున్న దృశ్యం

మదనపల్లె: ప్రైవేటు భవన నిర్మాణానికి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి నుంచి ప్రైవేటు వ్యక్తులు నీరు వాడుకుంటున్నారు. ఆస్పత్రి ప్రహరీని సైతం కూల్చివేసినా అధికారుల పట్టించుకోలేదు. ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి బోరు నుంచి నీళ్లను ఓ వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటు భవన నిర్మాణానికి ఉపయోగిస్తుండటం గమనార్హం. ఆస్పత్రి అవసరాలకు నీరు నిల్వ ఉండే ట్యాంకు పక్కనే ప్రైవేటు భవనం నిర్మాణంలో ఉంది. భవన నిర్మాణం చేస్తున్న వ్యక్తులు ఆస్పత్రి నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా విద్యుత్ మోటార్ ఉపయోగించి పైపు ద్వారా నిర్మాణానికి ప్రభుత్వ ఆస్పత్రి నీరు వినియోగిస్తున్నారు. ఆస్పత్రిలోని వార్డుల్లోని రోగులకు సక్రమంగా నీళ్ల లేక ఇబ్బందులు పడుతుంటే మరోఅధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై ఆర్ఎంఓ దివాకర్‌ను వివరణ కోరగా ఆస్పత్రి ట్యాంకు నుంచి తమకు తెలియకుండా నీటిని వినియోగించినట్లు గుర్తించి సెక్యూరిటీ సిబ్బందిని తొలగించామన్నారు. ఎవరి అనుమతితో ఆస్పత్రిలో నీరు వాడుకుంటున్నారో సోమవారం విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

స్కౌట్ విద్యార్థులకు గోల్డెన్ యారో అవార్డు



గోల్డెన్ యారో అవార్డులు అందుకున్న స్కౌట్ విద్యార్థులు

కురబలకోట: రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి గోల్డెన్ యారో అవార్డుకు ఎంపికై న 15 మంది స్కౌట్ విద్యార్థులు శనివారం అవార్డు అందుకున్నారు. హర్యానా రాష్ట్రం పాల్వాల్ జిల్లా ఘట్పూరి భారత్ స్కౌట్ కార్యాలయంలో జరిగిన అవార్డు ప్రధాన ఉత్సవంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షులు అనిల్‌కుమార్ జైన్, చీఫ్ నేషనల్ కమీషనర్ కెకె ఖండేల్వాల్ చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నారు. జిల్లా నుంచి ఎంపికై న ఆరుగురు స్కౌట్ విద్యార్థులు కూడా ఈ సందర్భంగా అవార్డులు అందుకున్నారు. వీరిలో కురబలకోట మండలం నార్లపల్లె ప్రాథమిక పాఠశాల నుంచి బి.భువనేష్ కుమార్‌రెడ్డి, దిగువ చెన్నామర్రి స్కూల్ నుంచి బి.చరిత్ర రెడ్డి, బి. కార్తీక్, వాల్మీకిపురం మండలం ప్యారంపల్లె స్కూల్ నుంచి ఎస్. శ్రీనివాసులు, బి.అభిషేక్, మదనపల్లె మండలం బాబు నగర్ స్కూల్ నుంచి ఎస్. నవీన్ కుమార్ గోల్డెన్ యారో అవార్డు అందుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆదివారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కబ్ మాస్టర్స్ ఆర్. సిద్దారెడ్డి, కె. సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, రవీంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం నుంచి 15 మంది ఈ అవార్డు అందుకోవడం గర్వకారణమని వెల్లడించారు.

గొల్లపల్లె రింగ్‌రోడ్డుకు మోక్షం

– రూ.76.86లక్షలతో తారురోడ్డు నిర్మాణం



గొల్లపల్లె రింగ్‌రోడ్డులో నూతనంగా వేసిన రోడ్డు

మదనపల్లె : పట్టణంలో గుంతలమయంగా మారి వాహనదారులకు ఇబ్బందికరంగా ఉన్నటువంటి గొల్లపల్లె రింగ్‌రోడ్డుకు మోక్షం కలిగింది. మున్సిపాలిటీ 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.76.86లక్షలతో 1.8 కిలోమీటర్లు (1,800 మీటర్లు) తారురోడ్డు నిర్మాణానికి అనుమతులు లభించడంతో పనులు ప్రారంభమయ్యాయి. గుంతల మయంగా ఉన్నటువంటి గొల్లపల్లె రింగ్‌రోడ్డుపై మూడురోజులుగా జరుగుతున్న తారురోడ్డు పనులతో ప్రయాణం ఇకపై సాఫీగా సాగనుంది. స్థానికంగా ఉన్నటువంటి చౌడేశ్వరి కల్యాణమండపం, రామారావుకాలనీ, గొల్లపల్లె రింగ్‌రోడ్డు వాసులు తారురోడ్డు నిర్మాణపనులపై హర్షం వ్యక్తం చేశారు.

అగ్నికి ఆహుతి అవుతున్న కొండలు, గుట్టలు



తలారివాండ్లపల్లె సమీపంలో కాలిపోతున్న కొండ

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో గత మూడురోజులుగా కొండలు, గుట్టలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి, రెండురోజులుగా చారిత్రాత్మక గుర్రంకొండ కోటలో కొండతోపాటు కోట పరిసరాలు కాలి బూడిదయ్యాయి. పట్టణ పరిసరాల్లో 1250 ఎకరాల్లో కొండలు, గుట్టలతో పాటు పొలం గట్లు కాలిపోయాయి.

ఆకతాయిలతో ముప్పు

పట్టణ పరిసరాల్లోని కొండలు, గుట్టల్లో గుర్తు తెలియని దుండగులు నిప్పు అంటించారు. వీటితో పాటు చారిత్రాత్మక గుర్రంకొండ కొండ, కోట పరిసరాల్లోనూ దుండగులు నిప్పుపెట్టారు. మంటలు పెద్ద ఎత్తున ఎగసి పడి కొండలు, గుట్టలు మొత్తం వ్యాపించాయి. ఈ సంఘటనలో కోటతో పాటు గుట్టలు, కొండ పరిసరాల్లో 125050 ఎకరాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ముచ్చుకోన, తోపువంక, తలారివాండ్లపల్లె, నర్సయ్యబండ, మచ్చాన్‌చెరువు ప్రాంతాలతో పాటు పట్టణ పరిసర ప్రాంతాలు గత మూడు రోజులుగా ఎక్కడ చూసిన మంటలు దానావాలంలా వ్యాపించాయి. చెట్లు, పొదలు, గుట్టలు, కొండలు కాల్చి బూడిద చేశాయి. కొన్ని ప్రాంతాల్లో మంటలు పొలాల వైపు దూసుకొచ్చాయి. దీంతో మంటలు ఆర్పివేసేందుకు రైతులు, గ్రామస్తులు పొలాలవైపు పరుగులు తీశారు. మరి కొందరు కొండలు, గుట్టల్లో చెలరేగిన మంటలు పొలాలవైపు రానీయకుండా ఆర్పివేసే ప్రయత్నాలు చేశారు. పలు పొలాల్లో మామిడిచెట్లతో పాటు ఇతర పండ్లతోటలు, డ్రిప్‌పైపులు, పరికరాలు కాలిపోయాయి. అడవుల్లోని పక్షులు, జంతువులు, సర్పాలు కాలిబూడిదయ్యాయి. మంటలతో ప్రాణాలు కాపాడుకొనేందుకు పక్షులు, జంతువులు, జనావాసాల వైపు పరుగులు తీశాయి. చారిత్రాత్మక గుర్రంకొండ కోటలు ఐదు రోజుల కింద చెలరేగిన మంటలను అప్పట్లో అదుపు చేశారు. అయితే గత రెండు రోజులుగా మళ్లీ మంటలు చెలరేగాయి. సిబ్బంది, గ్రామస్తులు మంటలు మంటలు అదుపు చేసే ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దీంతో కొండ మొత్తం రాత్రింబవళ్లు మంటల్లో చిక్కుకొని కాలిబూడిదయ్యింది. ఇన్ని రోజులు పాటు ఇంత పెద్ద ఎత్తున మంటలు చెలరేగడం పట్టణంలో ఇదే మొదటిసారని గ్రామస్తులు చర్చించుకోవడం గమనార్హం.